ప్రజాశక్తి
శనివారం 16 మార్చి 2024
5
పార్వతీపురం మన్యం

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి -వీరఘట్టం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ పరీక్షలు శుక్రవారంతో ప్రశాంతంగా ముగిసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ ఎం.కుమారస్వామి తెలిపారు. ఈ పరీక్షకు 228 మంది హాజరు కావాల్సి ఉన్నప్పటికీ ఏడుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు.

భామిని : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంగా నిర్వహించిన ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. మండలంలోని కెజిబివి, ఆదర్శ పాఠశాల, అంబేద్కర్ గురుకులం, జిజె కాలేజీ నుంచి సెకండ్ ఇయర్ విద్యార్థులు హాజరయ్యారని ప్రిన్సిపల్ గొల్లంగి ఎర్రంనాయుడు తెలిపారు. ఈ పరీక్ష కేంద్రంలో సెకండ్ ఇయర్ పరీక్షలకు 1603మంది విద్యార్థులు రాయాల్సి ఉండగా, 1524మంది పరీక్షకు హాజరయ్యారని, 79 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

నేడే వైసిపి తుది జాబితా విడుదల

- పాత కాపులుంటారా? కొత్త ముఖాలకు చోటిస్తారా?
- అంతుచిక్కని అధినేత అంతరంగం



ప్రజాశక్తి - సాలూరు

రానున్న ఎన్నికల్లో వైసిపి అభ్యర్థులుగా పోటీ చేసే వారి తుది జాబితా శుక్రవారం ప్రకటించనున్నారు. సిఎం జగన్ మోహన్ ఇడుపులపాయలో వైఎస్సార్ సమాధి వద్ద మొత్తం 175మంది ఎమ్మెల్యే, 25 మంది ఎంపీ అభ్యర్థుల పేర్లు ప్రకటించనున్నారు. దీంతో ఆశావహ అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది. మన్యం జిల్లాలో గల నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎవరు పోటీలో ఉంటారనే దానిపై స్పష్టత శనివారం రానుంది. జిల్లాలో మూడు ఎస్టీ, ఒక ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ నియోజకవర్గాల్లో రానున్న ఎన్నికల్లో వైసిపి పోటీ చేయడానికి సిటింగ్ ఎమ్మెల్యే లందరికీ అవకాశం దక్కుతుందా లేదా అనేది తెలియడం లేదు. పాత కాపులే బరిలో వుంటారా కొత్త ముఖాలకు చోటిస్తారా అన్నది తేలాల్సి ఉంది. సాలూరులో సిటింగ్ ఎమ్మెల్యే, డిప్యూటీ సిఎం రాజన్నదొర వరుసగా ఐదో సారి పోటీకి సిద్ధమవుతున్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆయనొక్కరే ఇంతవరకు కనిపిస్తున్నారు. అయితే అరుకు ఎంపిగా పోటీ చేయాలని రాజన్నదొరను పార్టీ నాయకత్వం ఆదేశిస్తే తప్ప ఆయనే అసెంబ్లీ ఎన్నికల బరిలో ఉంటారు. ఎంపిగా పోటీ చేయాలని ఉందని ఆయన పలుమార్లు కార్యకర్తల సమావేశాల్లో ప్రకటించారు. కానీ ఎంపీ సీటు కావాలని ఎక్కడా గట్టిగా మాట్లాడిన దాఖలాల్లేవు. ఇక పార్వతీపురం సిట్టింగ్ ఎమ్మెల్యే అలజంగి జోగారావు పరిస్థితి డోలాయమానంలో వున్నట్లు తెలుస్తోంది. భూకబ్జా, దందాలు, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న కారణంగా ఆయనకు రెండోసారి ఎమ్మెల్యేగా పోటీ అధిష్ఠానం అవకాశం ఇస్తుందా లేదా అంతుచిక్కడం లేదు. టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ కూడా ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయాలని భావిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే జయమణి పేరు కూడా పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. సిటింగ్ ఎమ్మెల్యే జోగారావును కాదని కొత్త అభ్యర్థికి అవకాశం ఇస్తారా లేదా అన్నది తేలాల్సి ఉంది. మాజీ మంత్రి, కురుపాం ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణి కూడా ఆమె ఆ నియోజకవర్గంలో బలమైన అభ్యర్థిగా కనిపిస్తున్నారు. మరో అభ్యర్థి పోటీలో లేకపోవడం ఆమెకు అనుకూల పరిణామంగా చెప్పవచ్చు. ఆమె పైన కూడా కొంత ప్రజావ్యతిరేకత ఉన్నప్పటికీ ప్రత్యామ్నాయం లేకపోవడంతో ఆమెనే ఖరారు చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఇక పాలకొండ లోనూ సిటింగ్ ఎమ్మెల్యే వి.కళావతికే మరోసారి అభ్యర్థిగా ప్రకటించే అవకాశం ఉంది. ఆమెకు ధీటుగా పోటీలో ఉండే అభ్యర్థి కనిపించకపోవడంతో ఆమెనే బరిలో దించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. స్థానిక ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌తో కొంతవరకు విభేదాలున్నప్పటికీ ఆయన అనివార్యంగా ఆమె అభ్యర్థి తత్వాన్నికే మద్దతు తెలపాల్సిన పరిస్థితి కనిపిస్తోంది.

మన్యం జిల్లాలో గల నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్వతీపురం తప్ప మిగిలిన మూడు నియోజకవర్గాల్లో సిటింగ్ ఎమ్మెల్యేలే పోటీ చేసే అవకాశాలు మెరుగ్గా వున్నాయి. పార్టీ అధినేత అంతరంగంలో ఏముందో శనివారం నాటి తుది జాబితా విడుదలైన తర్వాత తేలిపోనుంది. ఎన్నికల సమరానికి ముహూర్తం సమీపిస్తున్న తరుణంలో ఆశావహ అభ్యర్థుల్లో ఉత్కంఠకు అధినేత జగన్ ప్రకటనతో తెరపడనుంది.

స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్‌పి విక్రాంత్‌పాటిల్

సాధారణ ఎన్నికలకు ఉద్యాన కళాశాలలో ఏర్పాటు చేస్తున్న స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్, ఎస్‌పి విక్రాంత్ పాటిల్ శుక్రవారం తనిఖీ చేశారు. మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ కేంద్రాల్లో కల్పించాల్సిన మౌళిక సదుపాయాలు, తీసుకోవాల్సిన భద్రతా ఏర్పాట్లు గురించి సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు. నిరంతరం సిసి కెమెరాల పర్యవేక్షణ, విద్యుత్ సరఫరా ఉండాలని స్పష్టం చేశారు. బారికేడ్లు ఏర్పాటు, రాత్రి వేళల్లో వెలుగు ఉండేలా విద్యుత్ సదుపాయం, రక్షిత విద్యుత్ వైరింగు చేయాలని సూచనలు చేశారు. వాహనాలు పార్కింగు ఏర్పాట్లు పక్కాగా ఉండాలని ఆదేశించారు. నియోజకవర్గాల వారీగా రిసెప్షను సెంటర్లు, మీడియా సెంటరు ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ డిఆర్‌ఒ జి.కేశవనాయుడు, ఆర్‌డిఒలు కె.హేమలత, ఎ.వి.రమణ, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజీ, డ్వామా పిడి కె.రామచంద్రరావు, రోడ్లు భవనాలశాఖ ఇంజినీరింగ్ అధికారి ఎస్.వేణుగోపాలరావు, డిఇ అప్పాజీ, ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ ఆర్.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు

సాలూరు: ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రిటర్నింగు అధికారి, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణు చరణ్ తెలిపారు. ఎన్నికల ఏర్పాట్లపై శుక్రవారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో ఎఎస్‌పి సునీల్ శ్రావణ్‌తో కలిసి పోలీసులు, ఎన్నికల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎన్నికల సిబ్బంది నియమాళి విధిగా పాటించాలని, ఎవరికి కేటాయించిన విధులు వారు ఖచ్చితంగా నిర్వహించాలన్నారు. ఎంసిసి బృందాలు, ఖర్చుల పర్యవేక్షణ కమిటీ, పర్యవేక్షణ బృందాలు నిరంతరం అప్రమత్తతతో ఉండాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన 24 గంటల్లో ప్రభుత్వకార్యాలయం, ప్రాంగణాల్లో గల ఫోటోలు, పోస్టర్లు, బ్యానర్లు తొలగించాలని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులంతా ఎన్నికల ప్రవర్తనా నియమావళి పరిధిలోనికి వస్తారని, అన్ని స్థాయిల ఉద్యోగులు ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఖచ్చితంగా పాటించాలని, ఎంపిడిఒలు ఎన్నికల ప్రవర్తనా నియమావళి నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారని, ఎక్కడా ఉల్లంఘనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. తనిఖీ బృందాలు విధులకు సంబంధించి ఎన్నికల సమయంలో జప్తుచేసిన డబ్బు, ఇతర వస్తువులకు సంబంధించి ఎన్నికల జప్తు నిర్వహణ వ్యవస్థ (ఇ.ఎస్.ఎమ్.ఎస్.) యాప్ రూపొందించడం జరిగిందని, తనిఖీ బందాలు వారు పట్టుకున్న డబ్బు,యితర వస్తువులను జప్తుచేసి కేసు పెట్టడంతో పాటు వాటి వివరాలను ఈ యాప్ లో తప్పని సరిగా నమోదు చేయాలని తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేలే చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో టౌన్ సిఐ వాసు నాయుడు, రూరల్ సిఐ బాలకష్ణ, ఎస్ఐలు కెవి సురేష్,ఎంవి రమణ, నారాయణ రావు పాల్గొన్నారు.

సీతంపేట : ఎన్నికలకు సంబంధించిన అంశాలపై సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీస్ అధికారులకు స్థానిక ఐటిడిఎ పిఒ, పాలకొండ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కల్పనాకుమారి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికలకు సంబంధించిన నియమాలు, రిపోర్టులు సమర్పించే అన్ని ఫారాలపై సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ నిర్వహణలో సెక్టార్ అధికారులు పాటించాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. సెక్టార్ అధికారులు తమ పరిధిలోని పోలింగ్ స్టేషన్లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఎన్నికల్లో పోలీస్ అధికారులు పాటించాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీస్ హేమని కుమార్, శ్రీనివాస్, సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌ను పటిష్టంగా అమలు చేయాలి

ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని పాలకొండ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కల్పనకుమారి అన్నారు. శుక్రవారం మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ టీమ్‌లతో సమావేశం నిర్వహించారు. కోడ్ అమల్లోకి వచ్చిన 24 గంటల్లోపు బహిరంగ ప్రదేశాల్లో ఉండే రాజకీయ నాయకులకు సంబంధించిన స్టిక్కర్లను, ఫ్లెక్సీలను తొలగించాలని, విగ్రహాలకు ముసుగులు తొలగించాలని సూచించారు. ఓటర్లను ప్రభావితం చేసే ఎటువంటి ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించకూడదన్నారు. కోడ్ ఉల్లంఘన జరగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ, సిఐ, ఎంపిడిఒలు, ఇతర ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్లపై సాలూరు, సీతంపేటలో అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారులు విష్ణుచరణ్, కల్పనాకుమారి

గ్యాస్, పెట్రోల్ అమ్మకాలు పెంచండి : జిసిసి డిఎం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న గ్యాస్ గోదాము, పెట్రోల్ బంక్‌ల్లో సిబ్బంది సమయపాలన పాటించి అమ్మకాలు పెంచాలని, ప్రజలతో సత్సంబంధాలు పెంచుకోవాలని జిసిసి పార్వతీపురం డివిజనల్ మేనేజర్ మహేంద్ర కుమార్ సూచించారు. తన పర్యటనలో భాగంగా శుక్రవారం గ్యాస్ గోదాం, పెట్రోల్ బంక్ పరిశీలించారు. స్టాక్ నిల్వ రిజిస్టర్లు పరిశీలించారు. అనంతరం బ్రాంచి మేనేజర్ కృష్ణప్రసాద్, అకౌంటెంట్ గణపతికి తగు సూచనలు చేశారు. ప్రభుత్వం కొత్తగా విడుదల చేసిన 10 కేజీల సిలిండర్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఈ ఏడాది డివిజన్‌లో అటవీ వ్యవసాయ ఉత్పత్తుల లక్ష్యం రూ.9.20 కోట్లు కాగా ఇప్పటివరకు రూ.11.83 కోట్లు సాధించామని తెలిపారు. అన్ని రకాల విభాగాలు కలిపి నిత్యవసరాలు, డిఆర్‌ఎస్ అమ్మకాలు, గ్యాస్, పెట్రోల్ రూ.56 కోట్ల లక్ష్యం పూర్తి చేశామని తెలిపారు. ఈనెలాఖరుకు రూ.10 కోట్ల అమ్మకాలు పూర్తి చేస్తామని చెప్పారు.

గోడౌన్‌ను పరిశీలిస్తున్న డిఎం మహేంద్ర కుమార్

అగమ్యగోచరం.. సిఆర్‌టిల భవితవ్యం

- జనరల్ డిఎస్‌సిలో గిరిజన పోస్టులు విలీనం
- రోడ్డున పడనున్న కుటుంబాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జనరల్ డిఎస్‌సిలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను కలిపింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న 1200 కాంట్రాక్టు ఉపాధ్యాయులు (సిఆర్‌టి)లు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పదేళ్లుగా పనిచేస్తున్న తమను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయకపోవడం ఒక ఎత్తయితే, ప్రస్తుతం ఉన్న పోస్టులే పోయే పరిస్థితి ఏర్పడుతుందని, దీంతో తమ కుటుంబాలు రోడ్డున పడతాయని సిఆర్‌టిలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పాఠశాలల్లో 2014ముందు నుంచి పనిచేస్తున్న సిఆర్‌టిలను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసింది. 2014 తర్వాత చేరిన తమను రెగ్యులరైజ్ చేయకపోగా, ఉన్న పోస్టు కూడా ఊడిపోయే ప్రమాదం ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడైనా, ఏదో సమయంలోనైనా రెగ్యులర్ చేస్తారన్న గంపెడు ఆశతో ఉన్న తమపై ఆశలపై ప్రభుత్వం నీళ్లు చల్లిందని వాపోతున్నారు. ఇప్పటికైనా జనరల్ డిఎస్‌సి నుంచి తమ పోస్టులను మినహాయించి మా కుటుంబాలు రోడ్డున పడకుండా ఆదుకోవాలని సిఆర్‌టిలు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

పలుచోట్ల నూతన భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని మండ, దేవనాపురం, పెదరామ గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్నెస్ సెంటర్లను స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల స్థాయిలో ఉండే ప్రభుత్వ శాఖల సిబ్బంది అంతా గ్రామస్థాయిలో ఉండి, ప్రభుత్వ పరిపాలన క్షేత్రస్థాయికి తీసుకొచ్చి, సేవలను ప్రజల గడప వద్దకే అందించేందు సచివాలయాలు, గ్రామ వాలంటీర్ల వ్యవస్థ పనిచేస్తుందన్నారు. పరిపాలన, సంక్షేమం, విద్య , వైద్య ,వ్యవసాయ రంగాలను పరిపుష్టి చేసి పేదలందరికీ అండగా నిలిచిన యువ ముఖ్యమంత్రి జగన్‌ను మళ్లీ గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి బిడ్డిక ఆదినారాయణ, జెడ్‌పిటిసి ప్రతినిధి సవర రాము, ఎఎంసి చైర్మన్ హిమరక మోహన్‌రావు, వైస్ ఎంపిపిలు, జెసిఎస్ కో - ఆర్డినేటర్, స్థానిక సర్పంచ్‌లు, స్థానిక ఎంపిటిసిలు, సర్పంచులు, గ్రామ సచివాలయం కన్వీనర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళావతి

కృష్ణరాయపురంలో బిటి రోడ్డు ప్రారంభం

సీతానగరం : మండలంలోని కృష్ణరాయపురంలో ఎమ్మెల్యే ఎ.జోగారావు బిటి రోడ్డును శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో గ్రామానికి ఇచ్చిన హామీలో భాగంగా రూ.40 లక్షలతో బిటి రోడ్డు పనులు పూర్తి చేయడం ప్రజలకు అంకితం చేశారు. అంతేకాక తాను ఇచ్చిన హామీలన్నీ అమలు చేశానని రాబోయే ఎన్నికల్లో తనకు గ్రామం అంతా ఐక్యంగా ఉండే తనను గెలిపించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో గెలుపొందితే మరో మూడు రోడ్లు పూర్తి చేయడానికి సిద్ధంగా ఉన్నానని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి బి.రమణమ్మ, జెడ్‌పిటిసి ఎం.బాబ్జీ, సర్పంచ్ గుణుపూరు అన్నంనాయుడు, వైసిపి మండల అధ్యక్షులు బి.చిట్టిరాజు, మాజీ సిడిసి ఎన్.రామకృష్ణ, గ్రామ మాజీ సర్పంచ్ రెడ్డి అప్పలనాయుడు పాల బలరామనాయుడు వైసిపీ నాయకులు ఆర్ వి పార్థ పార్థసారథి వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

సదస్సులో మాటాల్డఉతున్న బిఎస్ఎన్ఎల్ జనరల మేనేజర్ ఆడమ్

29 బిఎస్ఎన్ఎల్ టవర్లు ఏర్పాటు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లాలో 29 బిఎస్ఎన్ఎల్ టవర్లు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని బిఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ (శ్రీకాకుళం) జి.ఆడమ్ అన్నారు. శుక్రవారం స్థానిక బిఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినియోగదారుల అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆడమ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ జిల్లాలో మొట్టమొదటి సారిగా వినియోగదారుల సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో 4జి సేవలను త్వరలో అందుబాటులోకి తెస్తామని తెలిపారు. ఫైబర్, ఎఫ్‌టిటిహెచ్ బ్రాడ్ బ్యాండ్ సేవలను కూడా మొదలుపెట్టడం జరిగిందని వివరించారు. జిల్లాలో బ్రాడ్ బ్యాండ్ 43, ఫైబర్ కనెక్షన్లు 401ఉన్నాయన్నారు. వెండర్స్ ద్వారా ఈ సేవలను వినియోగదారులకు అందిస్తున్నా మన్నారు. బిఎస్ఎన్ఎల్ అతి తక్కువ ధరలో ప్లాన్లు లభ్యమవుతున్నాయని, దీన్ని వినియోగించు కోవాలని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో అన్ని నెట్‌వర్క్‌ల కన్నా బిఎస్ఎన్ఎల్ నెట్ వర్క్ బాగా పని చేస్తోందన్నారు. ప్రతి వినియోగదారునికి నాణ్యమైన సేవలందించాలని, నెట్‌వర్క్‌లో సమస్యలు వస్తే వెంటనే పరిష్కరించాలని రిటైలర్స్‌కు సూచించారు. ఎయిర్ ఫైబర్ లాంటి ఆధునిక సేవలను బిఎస్ఎన్ఎల్ అందిస్తోందని ప్రతీ ఫ్రాంచైస్ ప్రజలకు అవగాహనా కల్పించాలని కోరారు. పార్వతీపురం నెట్ వర్క్ పరిధిలో ల్యాండ్ లైన్స్ 2889, బ్రాడ్ బ్యాండ్ 354, ఎఫ్.టి.టి.హెచ్.5856, ప్రీపెయిడ్ కనెక్షన్లు 217589 ఉన్నాయని, వాటి సంఖ్య మరింత పెరగాలని రిటైలర్లకు సూచించారు. కొత్తగా డు నాట్ డిస్టర్బ్ (డిఎన్‌డి) సేవలను కూడా ప్రవేశపెడుతున్నట్టు తెలిపారు.

ఈ సందర్భంగా రిటైలర్స్, ఫ్రాంచెస్ సిబ్బందికి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా విధివిధానాలపై అవగాహనా కల్పించారు. కార్యక్రమంలో విజయనగరం, శ్రీకాకుళం డిజిఎంలు దాలి నాయుడు, మర్రి నాయుడు, పార్వతీపురం, శ్రీకాకుళం ఎజిఎంలు సురేష్, తేజేశ్వరరావు, కాగ్ మెంబెర్ చిట్టి బాబు, బిఎస్ఎన్ఎల్ రిటైలర్స్, వినియోగదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ సర్టిఫికెట్లతో
ప్రభుత్వ ఐటిఐలో ఉద్యోగం

- ఫిర్యాదుతో అధికారుల దర్యాప్తు
- ఉద్యోగం నుంచి తొలగింపు

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక ప్రభుత్వ ఐటిఐలో నకిలీ సర్టిఫికేట్‌లతో ఉద్యోగం పొందిన విషయం వెలుగులోకి వచ్చింది. జిల్లా అధికారుల దర్యాప్తులో నకిలీ సర్టిఫికేట్‌లుగా నిర్ధారణ కావడంతో ఉద్యోగం నుంచి అతనిని టెర్మినేట్ చేశారు. శ్రీకాకుళం జిల్లా సొంపేట మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన మెట్ట సిద్ధార్థ్ నకిలీ సర్టిఫికేట్‌లతో ప్రభుత్వ ఐటిఐలో 2021లో ఎటిఒగా ఉద్యోగం సాధించారు. అదే గ్రామానికి చెందిన ఒక యువకుడు నకిలీ సర్టిఫికేట్‌లతో సిద్ధార్థ్ ఉద్యోగం పొందినట్లు ఐటిఐ ఉన్నతాధికారులకు, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేశారు. విజయనగరం ఐటిఐ ప్రిన్సిపాల్, విజిలెన్స్ అధికారులు వేర్వేరుగా చేపట్టిన దర్యాప్తులో కిలీ సర్టిఫికేట్‌లను గుర్తించి ఉద్యోగం నుంచి అతన్ని టెర్మినేట్ చేయాలని ఉన్నతాధికారులకు సిఫార్స్ చేశాఉ. దీంతో ఆయనను టెర్నినెట్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

ఒకే ఏడాదిలో ఇంటర్, ఐటిఐ సర్టిఫికేట్

మెట్ట సిద్ధార్థ్ ఒకే ఏడాదిలో ఇంటర్, ఐటిఐ సర్టిఫికేట్ పొందినట్లు అధికారులు గుర్తించారు. శ్రీకాకుళం జిల్లా హరిపురం సిద్ధార్థ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసినట్లు 2010 జూన్‌లో సర్టిఫికేట్ పొందగా, అదే ఏడాది జూలైలో పలాస ప్రభుత్వ ఐటిఐలో ఎలక్ట్రీషియన్ ట్రేడ్ పూర్తి చేసినట్లు సర్టిఫికేట్ పొందారు. ఒకే ఏడాదిలో ఇంటర్, ఐటిఐ పూర్తి చేసినట్లు సర్టిఫికెట్లు ఉండడంతో పాటు ఆంధ్రా యూనివర్సిటీలో ఇంజినీరింగ్ పూర్తి చేసినట్లు నకిలీ సర్టిఫికేట్ గుర్తించారు.

పోలీసులకు ఫిర్యాదు

నకిలీ సర్టిఫికేట్‌లపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ జివి రమణరావు చెప్పారు. నకిలీ సర్టిఫికేట్‌లపై దర్యాప్తు చేయగా నిర్ధారణ కావడంతో సిద్ధార్థ్‌ను ఉద్యోగం నుంచి టెర్మినేట్ చేసినట్లు ఉన్నతాధికారులు నుంచి ఉత్తర్వులు వచ్చాయని చెప్పారు. ఉన్నతాధికారులు సూచనలతో పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశామని చెప్పారు.

న్యాయ సాధన సభను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

కాంగ్రెస్ ఆధ్వర్యంలో విశాఖ స్టీల్ ప్లాంట్ డిక్లరేషన్‌పై విశాఖ స్టీల్ ప్లాంట్ వద్ద న్యాయ సాధన సభ శనివారం జరుగుతుందని, ఈ సభను జయప్రదం చేయాలని పార్వతీపురం నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్ ఆశావహి బత్తిన మోహన్‌రావు పిలుపునిచ్చారు. శుక్రవారం పార్వతీపురం వచ్చిన ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షర్మిల ఆధ్వర్యంలో జరుగు సమావేశానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వస్తున్నారని తెలిపారు. ప్రత్యేక హోదా సాధన దిశగా ప్రతి ఆంధ్రుడు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు బొన్నాడ కృష్ణ, బొమ్మాలి మోహన్ రావు, సిరిసిపల్లి శ్రీనివాసరావు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వినియోగదారుల హక్కుల సంఘం నాయకులు

అవగాహనతో వినియోగదారుల విజయం

వినియోగదారుల హక్కుల దినోత్సవంలో డిఎస్ఒ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

వినియోగదారుల చట్టంపై అవగాహనతో వారికి విజయం లభిస్తుందని జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్.శివప్రసాద్ అన్నారు. స్థానిక లయిన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం పౌరసరఫరాల శాఖ, జిల్లా వినియోగదారుల హక్కులు రక్షణ సంఘం సంయుక్తంగా శుక్రవారం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డిఎస్ఒ మాట్లాడుతూ వినియోగదారులకు ఇచ్చిన హక్కులను ప్రజలు ఉపయోగించుకోవాలని, హక్కులు తెలుసుకొని నడుచుకోవాలని అన్నారు. ఎక్కడైనా మోసపోతే సంబంధిత వినియోగదారుల సంఘాలకు గానీ, ప్రభుత్వాధికారులకు గానీ తెలపాలని కోరారు. సంఘం అధ్యక్షులు పి.సూర్యారావు మాట్లాడుతూ అనేక విధాలుగా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలంతా అవగాహన కలిగించి చట్టాన్ని ముందుకు నడిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాన కార్యదర్శి మాన్య రామకృష్ణ మాట్లాడుతూ అనేక సందర్భాల్లో ప్రజలు మోసపోతున్న కూడా ఫిర్యాదు చేయడానికి వెనకాడుతున్నారన్నారు. ఉచిత న్యాయ సహాయంపై ప్రజలు అర్థం చేసుకోవాలని, భావితరాల విద్యార్థులు చట్టం పరిధిలో ఉన్న అనేక ఉపకారాలను తెలుసుకొని ప్రశ్నించే తత్వం ఏర్పాటు చేసుకోవాలని కోరారు. కొన్న ప్రతి వస్తువు బిల్లు తీసుకోవాలన్నారు. తమ సంఘం ద్వారా అనేక ఉపయోగాలు ఉన్నాయని ప్రతి శనివారం సమావేశం జరుగుతుందని, ఫిర్యాదులు ఎలాంటివైనా రాతపూర్వకంగా తెలియజేస్తే ఉచిత న్యాయ సహాయం జరుగుతుందని ఆయన అన్నారు. సమావేశంలో లీగల్ మెట్రాలజీ, ఆహార భద్రత అధికారులు, డిప్యూటీ డిఎంహెచ్ఒ, సేంద్రియ పంటల రైతులు, ఉద్యోగులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మానవి మాసపత్రికను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ దీప్తి

మహిళా చైతన్య వారధి 'మానవి'

ప్రజాశక్తి - సాలూరు

మహిళా చైతన్యానికి వారధి లాంటిది చైతన్య మానవి పత్రిక అని మున్సిపల్ వైస్ చైర్మన్ జర్జాపు దీప్తి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా చైతన్య మానవి పత్రిక ప్రత్యేక సంచికను ఆమె ఐద్వా, శ్రామిక మహిళా సంఘం నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కారం పై దిశానిర్దేశం చేసేలా పత్రిక ఉండడం గొప్ప విషయమన్నారు. మహిళా హక్కుల కోసం పోరాడిన ఎందరో మహిళా నేతల జీవిత చరిత్ర గురించి తెలుసుకుని స్ఫూర్తి పొందేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు నాగమణి, శ్రామిక మహిళా సంఘం నాయకులు స్వప్న పాల్గొన్నారు.

పేదలకు ఎల్లవేళలా అండ ఎర్రజెండా

ప్రజాశక్తి - కొమరాడ

గిరిజనులకు, దళితులకు, పేదలకు ఎల్లవేళలా ఎర్రజెండానే అండగా ఉంటుందని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి అన్నారు. శుక్రవారం కురుపాంలో కరపత్రాలు పంపిణీ చేసి విలేకరులతో మాట్లాడారు. గిరిజన, దళితుల పేరు చెప్పుకొని ఆయా తరగతిలో గెలిచిన ఎమ్మెల్యేలు, ఎమ్‌పిలు దళితులకు, గిరిజనులకు రాజ్యాంగపరంగా రావాల్సిన నిధులు, హక్కులు రావడంలేదన్నారు. ప్రస్తుతం వైసిపి, టిడిపి, బిజెపి తరపున పోటీ చేసి గెలిచిన వారు పేదల సమస్యలు పట్టించుకునే పరిస్థితిలోలేరన్నారు. ఇలాంటి సందర్భంలో రానున్న ఎన్నికల్లో గిరిజనలు, దళితులు, బిసిలు, వృత్తిదారులు, రైతులు, కూలీలు, కార్మికులు, ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాల పక్షాన నికరంగా నిలిచి ఎల్లవేళలా పోరాడే సిపిఎం ఎర్రజెండా తరుపున ఎవరైతే పోటీ చేస్తారో వారికి అత్యధిక ఓట్లు మెజార్టీ గెలిపించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో రాము, సీతారాం, నాగభూషణ్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పంటల స్టాల్‌ను ప్రదర్శిస్తున్న ఎన్ఎఫ్ఎ సభ్యులు

నాణ్యమైన ఆహారం ఆరోగ్యానికి రక్ష

ప్రజాశక్తి- పార్వతీపురం

నాణ్యతమైన ఆహారం ఆరోగ్యానికి శ్రీరామరక్షని ప్రకృతి వ్యవసాయ మార్కెటింగ్ ఎన్ఎఫ్ఎ సభ్యులు తిరుపతిరావు, ప్రకృతి వ్యవసాయం సీతానగరం మండల ఇన్‌ఛార్జి నలితం గంగరాజు అన్నారు. శుక్రవారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవ స్థానిక లయన్స్ స్కూల్లో ఆవరణలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పురుగు మందులు లేకుండా సేంద్రీయ వ్యవసాయంతో పండించే ఆహార ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా ప్రతి ఒక్కరు సంపూర్ణ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు అన్నారు. వినియోగదారులు ప్రతి వస్తువు, సరుకులు నాణ్యతమైన ఎంపిక చేసుకోవడం వినియోగదారుల హక్కు అని అన్నారు. సేంద్రీయ వ్యవసాయంతో పండించిన పంటలు కూరగాయలు, బెల్లం, బియ్యం, సమస్త ఆహార పదార్థాలను నాణ్యతా ప్రమాణాలతో వినియోగదారులకు అందిస్తున్నామన్నారు.

ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు

ప్రజాశక్తి - సీతానగరం

ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేయాలని ఎంపిడిఒ ఎం.ఈశ్వరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌ఒలు, డిజిటల్ అసిస్టెంట్లు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూలు వచ్చిన వెంటనే గ్రామాల్లో ఎటువంటి బ్యానర్లు గానీ కటౌట్ లేకుండా చూడాలని అన్నారు. గ్రామాల్లో ఇటువంటి విధంగా చూడాలని ఆయన అన్నారు గ్రామాల్లో ఎన్నికల నియమాలపై అవగాహన సదస్సులు నిర్వహించి కల్పించాలన్నారు. సమావేశంలో తహశీల్దార్ జి.జనార్దనరావు, ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గిరిజన యువతకు వాలీబాల్ కిట్లు అందజేత

ప్రజాశక్తి -మక్కువ

మండలంలోని నంద పంచాయతీ పరిధిలోని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సాలూరు టిడిపి నియోజకవర్గ అభ్యర్థి గుమ్మడి సంధ్యారాణి పుట్టినరోజు సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించారు. టిడిపి సీనియర్ నాయకులు మావుడి ప్రసాదరావునాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన వాలీబాల్ టీంకు బహుమతులతో పాటు వాలీబాల్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎ.తిరుపతిరావు, జె.గౌరునాయుడు, జాగాన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జీవన వనరుల అభివృద్ధిపై సదస్సు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని పెదమరికిలో ఎపి సమీకృత నీటి పారుదల, జీవన వనరుల అభివృద్ధి పథకం (ఎపిఐఎల్‌ఐపి) గురించి జిల్లా స్థాయి ప్రాథమిక అవగాహనా సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాబర్ట్ పాల్ గ్రామంలోని రైతులతో వర్షపు నీటిని ఎలా వినియోగం చేసుకోవాలి, వ్యవసాయ పంటలు, నేల అభివృద్ధి ఎలా చేయాలని అన్న అంశాలు వివరించారు. అలాగే సేంద్రియ వ్యవసాయం వల్ల ఉపయోగాలు, మార్కెటింగ్ ఎలా చేస్తాం అన్న అంశాల గురించి జిల్లా ప్రకృతి వ్యవసాయ కార్య నిర్వాహక అధికారి షణ్ముఖరాజు మాట్లాడారు. అనంతరం ప్రోగ్రాంపై అవగాహన కల్పిస్తూ ఎడిఎ వెంకటేశ్వర్లు మాట్లాడారు. కార్యక్రమంలో ఎఒ అశోక్, విఎఎలు, రైతులు పాల్గొన్నారు.

పెరటి తోటల పెంపకంపై అవగాహన

ప్రజాశక్తి - గరుగుబిల్లి

పెరటి కూరగాయల పెంపకంపై ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ బి.హరిరామకుమార్ శుక్రవారం గరుగుబిల్లిలో రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంతో పాటు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులచే కూరగాయలు, విత్తనాలు నాటించే కార్యక్రమాన్ని చేపట్టారు. వయ్యారిభామ అనే కలుపు మొక్కల వల్ల కలిగే అనార్థాల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో హార్టికల్చర్ యూనివర్సిటీ సిబ్బందితో పాటు విద్యార్థులు పాల్గొ న్నారు.

తెట్టంగిలో పోలీసు కవాతు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని తెట్టంగిలో ఎన్నికల నియమావళిలో భాగంగా శుక్రవారం పురవీధుల్లో రైల్వే పోలీస్ బలగాలు కవాత్ నిర్వహించాయి. అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై ఎం.గోవింద్ , పాలకొండ ఎఎంసి ఉపాధ్యక్షులు పొట్నూరు లక్ష్మణరావు, కేంద్ర బలగాలు పాల్గొన్నాయి.

పుచ్ఛ పంటను ధ్వంసం చేసిన ఏనుగులు

ప్రజాశక్తి - భామిని

మండలంలని ఘనసార, కీసర, కొసలి గ్రామాల్లో సంచరిస్తున్న నాలుగు ఏనుగుల గుంపు గురువారం రాత్రి కొసలి గ్రామానికి చెందిన కరణం చంద్రశేఖర్, వలు రౌతు వాసుకు చెందిన సుమారు 2 ఎకరాలు పుచ్ఛ పాదులు, కాయలు ధ్వంసం చేశాయి. రెండు ఎకరాల్లో పుచ్ఛకాయలు ధ్వంసం వల్ల లక్ష రూపాయలు నష్టం వాటిల్లిందని రైతులు తెలిపారు. ప్రభుత్వం అధికారులు చొరవ తీసుకుని పంటను పరిశీలించి, నష్టం అంచనా వేసి నష్ట పరిహారం అందించేలా చూడాలని రైతులు కోరారు. ఈ ఏడాది పంట నష్టంతో బ్యాంకు రుణాలు తీర్చే పరిస్థితి లేదు అని వాపోయారు.

90శాతం హామీలు అమలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కురుపాం

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తన పాదయాత్రలో ఇచ్చిన మాటను నిలబెట్టుకుని 99 శాతం హామీలు పూర్తి చేశారని ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు చూసి జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. శుక్రవారం నియోజకవర్గ కేంద్రమైన కురుపాంలో ధూళికేశ్వర ఆలయ సమీప మైదానం వద్ద ఎంపిడిఒ ఎస్.అప్పారావు అధ్యక్షతన జరిగిన వైయస్సార్ చేయూత చెక్కులు పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయం, వాలంటరీ వ్యవస్థ పెట్టి సంక్షేమ పథకాలు నేరుగా ప్రజలకు అందించి పాలన అందిస్తున్నారని అన్నారు. కావున వైసిపి ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. అనంతరం 3357 మంది లబ్ధిదారులకు రూ.6 కోట్ల 29,43,750 చెక్కను మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, జడ్పిటిసి జి.సుజాత, జిల్లా కో-ఆప్షన్ సభ్యులు షేక్ నిషార్, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ జిలానీ, ఎపిఎం ఇవి కిషోర్, మండల కన్వీనర్ ఐ.గౌరీశంకర్, గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు, వాణిజ్య విభాగాల జిల్లా అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు, సచివాలయ, వైకెసి సిబ్బంది, వాలంటీర్లు, మండలంలో గల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, కార్పొరేషన్ డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

పిఎంఎంఎస్‌వైను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

జియ్యమ్మవలస : ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా రైతులకు చేపల రవాణా చేసుకొనేందుకు నాలుగు చక్రాల లైవ్ షిప్ రవాణా వాహనాన్ని ప్రభుత్వం సబ్సిడీపై ఆర్థిక సహాయాన్ని అదించి ఆదుకుంటుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి కోరారు. శుక్రవారం చినమేరంగిలో తన నివాసంలో ఆ శాఖ డిఎఫ్ఒ వి.తిరుపతయ్య ఆధ్వర్యంలో గుమ్మలక్ష్మీపురం సుందరయ్య కాలనీకి చెందిన భత్తుల సాయి పవన్‌కు కొత్త వాహనాన్ని ఎమ్మెల్యే అందజేశారు. ఇందులో యూనిట్ విలువ రూ.13 లక్షల 29,798 కాగా, బిసి రైతులకు రాయితీపై రూ.5 లక్షల 3192 రూపాయలు, లబ్ధిదారుల వాటా రూ.2లక్షల 65 958 రూపాయిలు ఇందులో బ్యాంకు రుణం కింద 5లక్షల 31920 ఇస్తున్నట్లు డిఎఫ్ఒ తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్డిఒ గోపాలకృష్ణ, ఈశ్వర రాజు, మత్స్య సహాయకారులు రాయుడు, సురేష్, ఇంద్రజ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ఆసరా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

ఆరోగ్యఆసరాతో గర్భిణులకు భరోసా

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ప్రధాన మంత్రి మాతృ వందన యోజన (పిఎంఎంవివై), ఆరోగ్య ఆసరా పథకాల ద్వారా గర్భిణీ సంక్షేమానికి ప్రయోజనకరమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. జగన్నాథరావు అన్నారు. స్థానిక వైద్య, ఆరోగ్య కార్యాలయంలో శుక్రవారం ప్రోగ్రాం అధికారుల సమీక్షలో డాక్టర్ జగన్నాథరావు మాట్లాడుతూ గర్భిణులకు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలపై అవగాహన కల్పిస్తూ ఆసుపత్రి, సాధారణ ప్రసవాలు జరిగేందుకు కృషి చేయాలన్నారు. పిఎంఎంవివై ద్వారా మొదటి కాన్పు గర్భిణీకి రూ. 5వేలు విడతల వారీగా మొదటి విడతగా లబ్దిదారుల ఖాతా లోకి జమ చేయడం జరుగుతుందని అన్నారు. ఆడపిల్ల జననాలు ప్రోత్సహించేందుకు స్త్రీ లింగ నిష్పత్తి పెంచేందుకు రెండో కాన్పులో ఆడ పిల్లను ప్రసవిస్తే మూడో మోతాదు టీకా పూర్తైన తర్వాత ఒకే విడతలో రూ. 6వేలు తల్లి ఖాతాలోకి జమ అవుతాయన్నారు. కావున వీటిపై విస్తత ప్రచారం చేసి ఆసుపత్రి సాధారణ ప్రసవాలు, స్త్రీ లింగ నిష్పత్తి పెంపునకు అందరూ కృషి చేయాలని ఆయన కోరారు. సమావేశంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు, ఆర్బిఎస్ కె ప్రోగ్రాం అధికారి డాక్టర్ రఘుకుమార్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వినోద్, డాక్టర్ తిరుమల ప్రసాద్, ఎపిడిమియాలజిస్ట్ డాక్టర్ శ్రీధర్ తదితరులు ఉన్నారు.

చిట్టిపూడివలసలో జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చిట్టిపూడివలసలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు . ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి ప్రదీప్ వివిధ రకాలైన రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.పాపమ్మ- లక్ష్మణ్, హెల్త్ సూపర్వైజర్లు కె.జనార్ధన్, ఒ.శాంతకుమారి, ఎఎన్ఎం పైడితల్లి, సచివాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - కొమరాడ

ప్రస్తుతకాలంలో జరుగుతున్న సైబర్ నేరాలపై ఖాతాదారులు అవగాహన కలిగి ఉండాలని ఎస్‌బిఐ కూనేరు శాఖ మేనేజరు మణికుమర్ అన్నారు. మండలంలోని కూనేరుతో పాటు పలు గ్రామాల్లో జరిగిన అవగాహన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. కళాబృందాలచే చైతన్యం కల్పించారు. ప్రస్తుత కాలంలో అత్యధికంగా సైబర్ నేరాల బారిన ఖాతాదారులు పడి తమ విలువైన డబ్బు పోగొట్టుకుంటున్నారని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైనా ఫోన్ చేసి బ్యాంకుకు సంబంధించిన వివరాలు, ఒటిపి వంటివి చెప్పరాదని స్పష్టం చేశారు. బ్యాంకు నుంచి వివరాలు కోసం ఏ ఒక్కరూ ఖాతాదారులకు ఫోన్ చేయరని ఈ విషయాన్ని ఖాతాదారులు గమనించాలని చెప్పారు. నగదుకు సంబంధించి ఏవైనా సందేశాలుంటే తప్పనిసరిగా బ్రాంచ్లో బ్యాంకు సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, కళాబృంద సభ్యులు, ఖాతాదారులు ఉన్నారు.

జిసిసి ద్వారా కుంకుడు పిక్కలు కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - పాచిపెంట

గిరిజన కార్పొరేషన్ ద్వారా కుంకుడు పిక్కలు కిలో వంద రూపాయలకు కొనుగోలు చేయాలని సిపిఎం నాయకులు కోరాడ ఈశ్వరరావు, దీసరి వసంతరావు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో కుంకుళ్ల ప్రధానమైన పంటగా ఉంటుందని, ఈ పంటను జిసిసి అధికారులు ధరలు నిర్ణయించి సకాలంలో కొనుగోలు చేసి గిరిజనులను ఆదుకోవాలని కోరారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - కొమరాడ

కొమరాడ : పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసిడిఎస్ సిబ్బంది

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని జెడ్‌పిటిసి సభ్యులు ద్వారపురెడ్డి లక్ష్మి, ఐసిడిఎస్ పిడి రాణి అన్నారు. పోషకాహార పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని గంగరేగువలస సెక్టార్ పరిధిలోగల గంగరేగువలస అంగన్వాడీ కేంద్రంలో కార్యకర్తలతో పోషణ పక్వాడ కార్యక్రమంపై శుక్రవారం ర్యాలీ, మానవహారం ద్వారా అవగాహన కల్పించారు. అంగన్వాడీ కేంద్రాల పరిధిలో గల గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి జి.చిన్మయి దేవి మాట్లాడుతూ ఈ 15 రోజులు ప్రతి అంగనవాడీ కేంద్రం వద్ద ప్రతిరోజు గర్భిణిలకు, బాలింతలకు, కిశోర బాలికలకు, పిల్లలకు పోషకాహార ప్రాముఖ్యత గురించి తెలియజేయాలని అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు. అలాగే పిల్లల్లో మేధాశక్తి, చురుకుదనం పెంపొందించేలా ఆటపాటలతో కూడిన విద్య, ఆహారపు అలవాట్లు పెంపొందించేలా కృషి చేయాలన్నారు. పోషకాహారాన్ని పిల్లలు, గర్భిణులు, బాలింతలు పూర్తి స్థాయిలో వినియోగించుకొని రక్తహీనత నివారణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కొమరాడ ప్రాజెక్టు పిఒ సుగుణ, బొబ్బిలి పిఒ, సూపర్వైజర్ శారద, సెక్టార్ యూనియన్ నాయకులు అలివేలు, కార్యకర్తలు అనురాధ, సుజాత హెల్పర్లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : కొమరాడ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మండలంలోని ఉల్లిభద్రలో శుక్రవారం అంగన్వాడీ వర్కర్లు ఏర్పాటు చేసిన పౌష్టికాహారం స్టాల్‌ను ఎంపిడిఒ పైల సూర్యనారాయణ, సర్పంచ్ శెట్టి దివ్యలక్ష్మి సందర్శించారు.. అనంతరం ఎంపిడిఒ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతల్లో రక్తహీనతను నివారించేందుకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. సర్పంచ్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా వైయస్సార్ సంపూర్ణపోషణ, పోషణప్లస్ కార్యక్రమం కింద గర్భిణులు, బాలింతలకు ఇంటింటికీ రేషన్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గరుగుబిల్లి పిహెచ్‌సి హెల్త్ విజిటర్ చింతాడ ఉదయకుమారి, సూపర్వైజర్లు రౌతు లక్ష్మి, అంగన్వాడి వర్కర్లు మరడాన కల్పన, ఎస్.లావణ్య, సునీత, తదితరులు పాల్గొన్నారు.

బీరుపాడులో ప్రచారం చేస్తున్న జగదీశ్వరి

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

తనకు ఓటు వేసి అసెంబ్లీకి పంపిస్తే మన గిరిజన ప్రాంత సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తానని కురుపాం నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని బీరుపాడు పంచాయతీ వాడజంగిలో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గిరిజన ప్రాంతాల్లోని ప్రధాన సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు. అనంతరం గ్రామంలో ఉన్న 90 కుటుంబాలు వైసిపి నుంచి టిడిపిలోకి చేరాయి. కార్యక్రమంలో మండల కన్వీనర్ పాడి సుదర్శన్ రావు, క్లస్టర్ ఇంచార్జ్ కిల్లక దాసు, నాయకులు ధర్మారావు, సుందర్ రావు, కోటేశ్వరరావు, సీతారాం తదితరులు ఉన్నారు.

కురుపాం : మండలంలో మొండెంఖల్‌లో శుక్రవారంఉమ్మడి అభ్యర్థి టి.జగదీశ్వరి గెలుపు కోసం టిడిపి మండల కన్వీనర్ కె వి కొండయ్య, జనసేన మండల కన్వీనర్ ఎన్.వంశీ, జిల్లా పరిషత్ మాజీ కో ఆప్షన్ సభ్యులు రంజిత్ కుమార్ నాయక్ టిడిపి శ్రేణులతో కలిసి ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించి రానున్న ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థి గెలుపునకు అంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటరావు, వెంపటి భారతి, సుక్కు, దినేష్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని గుమ్మిడిగూడ పంచాయతీ దండుసూరకు చెందిన కద్రక రవి మృతి చెందడంతో ఆయన భార్య కద్రక చిన్నమ్మికి శుక్రవారం ఆ గ్రామ సర్పంచ్ శెట్టి సురేష్, వైసిపి గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు వైఎస్సార్ బీమా తక్షణ సహాయం రూ.10వేలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుటుంబ సభ్యులకు అన్ని విధాలా అండగా ఉంటామని, రావాల్సిన మిగతా సహాయం కూడా త్వరగా అందేలా చూస్తామని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.రామచంద్ర, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్లకోమాపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో గ్లకోమ వ్యాధిపై వృద్ధులకు, మహిళలకు కంటి వెలుగు నేత్ర వైద్యాధికారి జీరు నగేష్ రెడ్డి శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 45 ఏళ్లు దాటిన తర్వాత విధిగా నేత్రపరీక్షలు ప్రతి ఒక్కరూ చేయించుకోవాలన్నారు. సకాలంలో సరైన చికిత్స లేకపోవడం, నిర్లక్ష్యం చేయడం వల్ల శాశ్వతంగా అంధత్వం వస్తుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ సుకృత, డాక్టర్ మౌనిక, డాక్టర్ ఆశాలత, నేత్ర వైద్య సహాయకులు ఉమామాహేశ్వరి, మాలిక పాల్గొన్నారు.

గొర్రెల, మేకల పెంపకం దారులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి - పాచిపెంట

గొర్రెల, మేకల పెంపకందారులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని జీవాలకు మేత, తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని గొర్రెల, మేకల పెంపకం దారులు సంఘం మండల నాయకులు రాపాక మంగయ్య, రండి తిరుపతి, రాపాక అప్పలస్వామి, కోండ్రు రాములు ప్రభుత్వాన్ని కోరారు. ఎండనకా, వాననకా, రాత్రనక పగలనక ఎన్నో కష్టాలు పడి ఈ వృత్తే జీవనాధారంగా ఉన్న పెంపకందారులకు ఎటువంటి భద్రత లేదని, జీవాలకు రక్షణ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని, జీవాలు నిలుపుకోవడానికి కూడా స్థలాలు ఉండడం లేదని అన్నారు. డి-వార్మింగ్, నట్టల మందులు ఏడాదికి నాలుగుసార్లు సక్రమంగా వేయాలని, వృత్తిలో ఉన్న యువకులకు జీవాల రక్షణకై శిక్షణ ఇప్పించి వృత్తికి రక్షణ చర్యలు చేపట్టాలని, సామాజిక భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పిట్ట తిరుపతి, బూర పాపయ్య తదితరులు పాల్గొన్నారు

ఓటు హక్కు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - సాలూరు

ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఎన్నికల రోజున తమ ఓటును వినియోగించుకోవాలని నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పి.వేణుగోపాలరావు కోరారు. శుక్రవారం నీడ్ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, దాంతోనే మంచి పాలన అందించే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులంతా ఓటరుగా నమోదు కావొచ్చునని చెప్పారు. ఇంకా ఎవరైనా ఓటు హక్కు పొందకపోతే నమోదు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నీడ్ పిసి కె.మోహనరావు, మహిళా కోఆర్డినేటర్ రత్నం పాల్గొన్నారు.

రసాయన ఎరువులే మేలు

ప్రజాశక్తి - పాచిపెంట

రైతులు విచక్షణారహితంగా రసాయన ఎరువులను వాడడం వల్ల పురుగులు, తెగుళ్ల ఎక్కువ ఆశిస్తాయని కాబట్టి వ్యవసాయ శాఖ సూచనల మేరకు మట్టి నమూనాల విశ్లేషణ ఆధారంగా ఎరువులు వాడుకోవాలని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని ఆజూరులో వరి, చోడి పంటలను పరిశీలించిన అనంతరం రైతులతో మాట్లాడుతూ గిరిజన రైతులు ప్రకృతి సేద్య పద్ధతుల్లో పంటలను పండించాలని, చిరుధాన్యాలను ఎక్కువగా పండించాలని సూచించారు. తమ చుట్టూ దొరికే ప్రకృతి వనరులతోనే జీవామృతాలు, కషాయాలను ఎలాంటి ఖర్చు లేకుండా పండించాలని తెలిపారు. అనంతరం వెలుగు ఎపిఎం జైకుమార్ ఏర్పాటు చేసిన మహిళా సమాఖ్యలో మాట్లాడుతూ సాంప్రదాయ రసాయన ఎరువుల స్థానంలో నానో ఎరువులను వాడినట్లయితే ఖర్చు తగ్గడమే కాకుండా పర్యావరణానికి ఎలాంటి హాని జరగకుండా ఉంటుందన్నారు. అనంతరం చింతపండు సేకరణ, మార్కెటింగ్ విషయాలను మహిళా సమైక్యకు వివరించారు కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సురేష్, విజయ్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు : ఎంపిపి

ప్రజాశక్తి -కొమరాడ

రానున్న వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపడుతున్నట్లు ఎంపిపి శెట్టి శ్యామల అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వేసవి నీటి ఎద్దడి నివారణలో భాగంగా క్రాస్ ప్రోగ్రాం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఏటా వేసవి ప్రారంభం ముందు క్రాస్ ప్రోగ్రాం ద్వారా మండలంలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మండలంలోని 31 గ్రామపంచాయతీ పరిధిలో గల మంచినీటి బోర్లు, బావులు, రక్షిత మంచినీటి పథకాల ట్యాంకులను మరమ్మతులు చేసి ప్రజలకు సక్రమంగా తాగు నీరందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా బోర్లు మరమ్మతులు చేసే మెకానికులు వాహనంపై గ్రామ గ్రామానికి వెళ్లి బోర్లు మరమ్మతులు చేసి ప్రజలకు తాగునీరు అందిస్తారని తెలిపారు. గ్రామాల్లో మంచినీటి సమస్య ఉంటే తక్షణమే అధికారులు దృష్టికి తీసుకెళ్తే పరిష్కరిస్తారన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ద్వారపురెడ్డి లక్ష్మి, ఎంపిడిఒ ఎం.మల్లికార్జునరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ నవీన్ కుమార్, వైసిపి మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దన్, వైస్ ఎంపిపి ఎన్.శరత్‌బాబు, కార్యాలయ ఎఒ ఎస్.రమేష్, వైసిపి నాయకులు సింహాచలంనాయుడు, పైల వెంకటరమణ, బోరు మెకానిక్‌లు ఉన్నారు.

ఆశయ హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని రావుపల్లిలో శ్రీసత్య సాయిబాబా మందిరం ఆవరణలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయ వంతమైంది. ఆశయ హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ హాస్పిటల్ కంటి వైద్య నిపుణులు డాక్టర్ జాక్సన్ రోగులకు తనిఖీలు నిర్వహించారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. ఈ వైద్య శిబిరంలో ఆపరేషన్లకు గుర్తించిన వారిని విశాఖ శంకర్ ఫౌండేషన్ హాస్పిటల్‌లో శస్త్రచికిత్సలకు తరలించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు, (మహేష్) ఆశయ హెల్పింగ్ హాండ్స్ సభ్యులు చుక్క జగన్, పళ్లెం భార్గవ్, మర్రాపు సాయి, మర్రాపు శంకరరావు, గరుగుబిల్లి పిహెచ్‌సి నేత్ర వైద్య నిపుణులు గొర్లి వేణుగోపాలరావు, క్యాం పు కోఆర్డినేటర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని వెంగాపురానికి చెందిన యామల రాంబాబు (29) శుక్రవారం సాయంత్రం ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్ఐ వి.పాపారావు తెలిపారు. రాంబాబుకు భార్య స్వరూప, కుమార్తె ఉన్నారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలోని గజాలఖానా దగ్గర పొలాల్లో ఈనెల 14న గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్టు స్థానికులు గుర్తించారు. మృతుడికి సుమారు 65సంవత్సరాలు ఉంటుందని, ఒంటి పైన బట్టలు కూడా లేవని, కేవలం ఎర్రని చిరిగిన డ్రాయర్ మాత్రమే ఉందని స్థానికులు గుర్తించారు. వెంటనే విఆర్‌ఒ బలివాడ శ్రీనివాస్‌కు సమాచారం ఇవ్వగా ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ప్రశాంత్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలో తంపటాపల్లి జంక్షన్ దగ్గర శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. టికె రాజపురానికి చెందిన పోగిరి సూరిబాబు, నేతల మాధవ్ ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై పాలకొండ వస్తుండగా, ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న సూరిబాబు, మాధవ్ గాయపడ్డారు. వీరిని 108వాహనంలో పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ ప్రశాంత్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేరాలు ఘోరాలు

భారీగా మద్యం సీసాలు సీజ్

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని స్థానిక పోలీసులు శుక్రవారం మధ్యాహ్నం మద్యంపై కొరడా గులిపించారు. కె.గోవిందమ్మ అనే మహిళ నుంచి 1973 మద్యం సీసాలు పట్టుకొని సీజ్ చేశారు. ఎస్సై వి.పాపారావు ఇచ్చిన వివరాలు ప్రకారం కె.గోవిందమ్మ పట్నాన కోటేశ్వరరావు కల్యాణ మండపం దిగువున ఉన్న గోదామును రూ.1500 అద్దెకు తీసుకొని, గత కొద్దిరోజులుగా మద్యం సీసాలు విక్రయించి, ఎన్నికల సమయంలో అధిక రాబడి కోసం దాచిపెట్టుకుంది. అక్కడే కిరాణా కొట్టు, భోజన హొటల్ నిర్వహిస్తోంది. దగ్గర్లోనే ఈ మద్యం సీసాలను నిల్వచేసి అక్రమాలకు పాల్పడిందని తమకు అందిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించగా అవి బయటపడ్డాయి. 1973 మద్యం సీసాలు నిల్వ సుమారు మూడు లక్షలు ఉంటుందని, ఈ సీసాలను సీజ్ చేసి ఆమెపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుమ్మలక్ష్మీపురంలో డ్రై డే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక సుందరయ్య కాలనీలో శుక్రవారం మలేరియా సిబ్బంది, ఆశా వర్కర్లు ఆధ్వర్యంలో డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా సిబ్బంది మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరూ మురుగునీటి కాలువులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, లేనిపక్షంలో దోమలు విచ్చలవిడిగా పెరిగి పలు రకాల వ్యాధులకు కారణం అవుతాయని అన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ జె.వెంకట్రావు, భద్రగిరి మలేరియా టెక్నికల్ సూపర్వైజర్ జి.కేశవరావు, ఆశాలు చంద్రకళ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

PALAKONDA NAGAR PANCHAYAT
E-Procurement Tender notice
("Purpose for High impact works (HIWs) Gadapa Gadapaku Mana Prabhutvam")

Roc.No.85/2024/E1 /GGMP (High impact works) /Date: 15-03-2024.

Sir,
www.apeprocurement.gov.in
IFB NO/Nit No :
86/2024/E1-PNP/Dt. 15-03-2024 To 125/2024/E1-PNP/Dt.15-03-2024

Bid Document Downloading Start Date : 16/03/2024, Time:10:00 AM,
Bid Document Downloading End Date : 26/03/2024, Time:05:00 PM,
Last Date & Time for Receipt of Bids : 26/03/2024, Time: 05:30 PM,
Bid Opening Date : 26/03/2024,, Time:06:00 PM,

Contact Details : Cell No. 9849944722, 9032439484, palakondanpl@gmail.com, palakondanp@gmail.com, www.apeprocurement.gov.in,

Municipal Commissioner
Palakonda Nagar Panchayat